# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 14 డిసెంబర్ 2024 HYDERABAD





## సింథటిక్ కలర్స్‌తో ఆహారం!

సిటీబ్యూరో: హెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఓఆర్ఆర్, ముత్తంగి పరిసర ప్రాంతాల్లో పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ముత్తంగి ఇస్తారా బాబాయ్‌లో వంటగది అపరిశుభ్రంగా, కొన్ని కూరగాయలు కుళ్లిపోయినవి, పాడైపోయినవి వంటివి గుర్తించారు. తయారు చేసిన ఆహారంలో ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు తనిఖీలో తేల్చారు. ముత్తంగి గుల్షాన్ హోటల్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలతో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ది ప్లేస్-2లో వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు తేల్చారు. ఫ్రిజ్‌లో వెజ్ అండ్ నాన్‌వెజ్ ఫుడ్స్ ఒకే చోట నిల్వ చేశారని గుర్తించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో వంటగది ఉందని, ఆహార ప్యాకెట్లకు లేబుల్స్ సరిగా లేవని తేల్చారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని గుర్తించి చర్యలు తీసుకున్నారు.

## రేపటి నుంచి గ్రూప్ - 2 పరీక్షలు

### బస్సుల సమాచారం కోసం ప్రత్యేక కాల్ సెంటర్లు



సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 పరీక్షలు రేపటి ఆదివారం, సోమవారం జరుగుతున్న దృష్ట్యా అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయంలో చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 101 పరీక్ష కేంద్రాలకు గాను నగరం నలుమూలల నుంచి బస్సులు అందుబాటులో ఉంచడంతో పాటు సెంటర్ల నుంచి తిరుగు ప్రయాణానికి సైతం బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు. బస్సుల సమాచారం కోసం.. కోఠి - 99592 26160, రేతిఫైల్ బస్ స్టేషన్ - 99592 26154 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# ఈబీఆర్‌టీఎస్ బుట్టదాఖలు

### ఫోర్త్‌సిటీ మెట్రో మోజులో పక్కన పెట్టేసిన ప్రణాళికలు

### కేపీహెచ్‌బీ నుంచి గచ్చిబౌలి వరకు బస్ ట్రాన్స్‌పోర్టు సిస్టం

### గతంలో అధ్యయనం చేసిన హెచ్ఎండీఏ-హుమ్టా

ఫోర్త్ సిటీకి మెట్రో మోజులో నగరంలో అధునాతన రవాణా సౌకర్యాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శఠగోపం పెడుతున్నది. దాదాపు రూ. 3వేల కోట్ల అంచనా వ్యయంతో కేపీహెచ్‌బీ నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు ఈబీఆర్‌టీఎస్ (ఎలివేటెడ్ బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్టు సిస్టం) తీసుకురావాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును నిర్మించేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఈబీఆర్‌టీఎస్ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. అధునాతన రవాణా కంటే, జనసంచారం లేని ప్రాంతాలకు మెట్రో విస్తరించాలని చూస్తోంది. కూకట్ పల్లి జంక్షన్ మీదుగా నిత్యం వేలాది మంది ఐటీ కారిడార్‌కు రాకపోకలు సాగించే ప్రాజెక్టును పక్కన పెట్టేసింది.

- సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ)




మహారాష్ట్రలో నమూనా చిత్రం

### కాగితాలకే పరిమితం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

మెట్రో విస్తరణకు అనువుగా లేని, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎలివెటేడ్ బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్టులను నిర్మించాలని హైదరాబాద్ అర్బన్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ ప్రత్యేక నివేదిక రూపొందించింది. ఇందులో భాగంగా నగరంలో మొదట దశలో దాదాపు 70 కిలోమీటర్ల మేర మెట్రో అందుబాటులోకి వచ్చింది. కానీ ఎప్పుడో నిర్మించాల్సిన బీఆర్‌టీఎస్ ప్రాజెక్టును కాంగ్రెస్ సర్కారు కాగితాలకే పరిమితం చేసింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం ద్వారా రూ.3 వేల కోట్ల అంచనా వ్యయంతో తొలి దశలో 22 కిలోమీటర్ల మేర ఈబీఆర్‌టీఎస్ నిర్మించాలని ప్రతిపాదించింది. దీనికి అనుగుణంగా భూసేకరణ, ప్రాజెక్టు డిజైన్లు, రూట్ మ్యాప్, మెట్రో అనుసంధానం వంటి అంశాలతో పకడ్బందీ ప్రణాళికలను సిద్ధం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం పాత ప్రణాళికలను పక్కనపెట్టేలా.. మెట్రో విస్తరణ పేరిట ఫోర్త్ సిటీకి మళ్లించింది.

### ఫోర్త్ సిటీ మెట్రోతో ప్రతిపాదనలకు మంగళం..

నగరానికి సుదూరంగా, గతంలో ఫార్మా సిటీ నిర్మాణానికి ప్రతిపాదించిన ముచ్చెర్లను ఆనుకుని ఫోర్త్ సిటీకి కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టింది. కాగితాలకే పరిమితమైన ఈ ప్రాంతానికి రెండో దశలోనే మెట్రో విస్తరిస్తామని హామీ ఇచ్చింది. ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీకి చేరుకునేలా ఎలివేటెడ్ మెట్రోతో డిజైన్లు ఖరారు చేసింది. కానీ ఎప్పుడో ప్రతిపాదించిన ఈబీఆర్‌టీఎస్‌ను పక్కన పెట్టింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు విషయంలో ఎలాంటి కదలికలు లేవు. ఈబీఆర్‌టీఎస్‌పై హెచ్ఎండీఏ చేసిన అధ్యయనాలను కూడా పరిశీలించకుండానే... మెట్రో విస్తరణ పేరిట ప్రాజెక్టుకు మంగళం పాడేశారు. భవిష్యత్‌లో కూడా మెట్రో రవాణా సదుపాయం లేని ప్రాంతాల్లో ఈబీఆర్‌టీఎస్ వచ్చే అవకాశం లేదని తెలిసింది.





గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ 5వ క్రిస్మస్ ట్రీ సంబురాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వినూత్న తరహాలో క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు. పలు రకాల మొక్కలతో కూడిన కుండీలతో పర్యావరణ హిత క్రిస్మస్ ట్రీని ప్రత్యేకంగా రూపొందించి..విద్యుద్దీపాలతో అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

-శేరిలింగంపల్లి, డిసెంబర్ 13



కందుకూరు వ్యవసాయ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

## రైతులకు రుణమాఫీ చేయడంలో సర్కారు విఫలం

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు: రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతన లేదని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి లావణ్యను ఎంత మంది రైతులకు రుణమాఫీ అయిందని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబితాఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రుణమాఫీ 50 శాతం మందికి కూడా కాలేదని, చాలా మంది రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ నేటికీ తిరుగుతున్నట్లు చెప్పారు. రుణమాఫీ, రైతుబంధు ఇవ్వకుండా ప్రభుత్వం రైతు సంబురాలను నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ఎంత మందికి రుణ మాఫీ చేశామనే నివేదికలు అధికారుల వద్ద లేవన్నారు. సంక్రాంతి తర్వాత రైతు బంధు వేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని ఆయన మాటలను ఎంత వరకు నమ్మాలని చెప్పారు. బీఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రమబద్ధీకరణ ఎన్నడో..?

### లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు

- ఏడాది కిందటే నివాస స్థలాల దరఖాస్తుల పరిశీలన పూర్తి
- మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో 58,59 జీవోలో 48 వేల మంది దరఖాస్తుదారులు
- భూ క్రమబద్ధీకరణపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం

మేడ్చల్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏండ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిరుపేదలకు భూ క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. రెండో విడత భూ క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిరుపేదల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 58,59 జీవో కింద లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలనను పూర్తి చేశారు. అనంతరం అర్హులను గుర్తించి జీవో 58, 59 కింద భూ క్రమబద్ధీకరణ చేయాల్సి ఉండగా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో భూ క్రమబద్ధీకరణ వాయిదా పడింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా.. 58, 59 జీవో కింద చేపట్టాల్సిన భూ క్రమబద్ధీకరణపై నిర్లక్ష్యం వహిస్తున్నదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న భూ క్రమబద్ధీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. 58, 59 జీవో కింద భూ క్రమబద్ధీకరణపై అధికారులను లబ్ధిదారులు సంప్రదిస్తే తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

**అత్యధిక దరఖాస్తులు..**

58,59 జీవోలో అత్యధికం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచే అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల నుంచి అత్యధిక నిరుపేదలు దరఖాస్తులు చేసుకున్నారు. 58 జీవో కింద 26,205, 59 జీవో కింద 15,602 దరఖాస్తులు వచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో 41 బృందాలు దరఖాస్తుల ఆధారంగా నేరుగా నివాసాల వద్దకు వెళ్లి పరిశీలన చేసి అర్హులను గుర్తించి నివేదికలను జిల్లా కలెక్టర్ లాగిన్‌కు అప్‌లోడ్ చేశారు. 58, 59 జీవోల నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం ఎప్పుడు జరిగింది... ఇంటికి సంబంధించిన ధ్రువీకరణపత్రాలను ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేసిన విషయం తెలిసిందే. నిబంధనల మేరకే ఉన్న వాటినే అర్హులుగా గుర్తించినప్పటికీ దరఖాస్తులకు మోక్షం ఎప్పుడు అన్న ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.



శుక్రవారం సాయంత్రం సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతి వద్ద ఆవిష్కృతమైన అద్భుత దృశ్యమిది.

అమరజ్యోతి..నిత్య జ్వలిత దీప్తి

## గ్రేటర్‌ను వణికిస్తున్న చలి పులి

ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే కిందకు పడిపోతుండడంతో గ్రేటర్‌లో చలి తీవ్రత పెరుగుతున్నది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 29.0, కనిష్ఠం 17.9 డిగ్రీలు, గాలిలో తేమ 41 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. - సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ):



### వ్యవసాయం విశిష్టతను చాటుతూ..

ఖైరతాబాద్, డిసెంబర్ 13 : భారతదేశానికి వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరు.. సేద్యం.. ప్రకృతి వ్యవసాయం విశిష్టతను తెలుపుతూ శుక్రవారం సోమాజిగూడలోని విల్లా మేరీ గర్ల్స్ జూనియర్ కళాశాల విద్యార్థినులు 'ఫీస్టా డీ లా కోశేచ' పేరుతో హార్వేస్ట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. భారతదేశంతో పాటు వివిధ దేశాల్లో వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్, ఆహార భద్రత తదితర అంశాలపై ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు వాటి విశిష్టను తెలుపుతూ.. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.